క్లుప్తంగా

అహోబిలేశుడి సేవలో..



ఎమ్మెల్యేకు స్వామి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

ఆళ్లగడ్డ: అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం సందర్భంగా ఆదివారం దిగువ అహోబిలం చేరుకున్న ఎమ్మెల్యేకు ఆలయ మర్యాదల్లో భాగంగా అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. శ్రీ ప్రహ్లాదవరదస్వామి, అమృతవల్లీ , గోదాదేవి అమ్మవార్లను దర్శించుకున్న అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వచనాలు పలికారు.

ప్రత్యేక పూజలు

దొర్నిపాడు: మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. నూతన సంవత్సరం కావడంతో ఉదయం అమ్మవారి మూలవిరాట్‌ను విశేషంగా అలంకరించి పూజలు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

కవితా సంపుటి ఆవిష్కరణ



పుస్తకావిష్కరణ గావిస్తున్న ప్రముఖులు

నంద్యాల(వ్యవసాయం): హైదరాబాద్‌లోని సోమాజీగూడ ప్రెస్ క్లబ్‌లో ఆదివారం మహర్షి వాల్మీకి సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సాహితీ సంబరాలు, కవి సమ్మేళన కార్యక్రమంలో నంద్యాల కవి రచయిత కొప్పుల ప్రసాద్ రచించిన 'చిరుగాలి పలకరిస్తే' కవితా సంపుటిని ఆవిష్కరించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పద్మశ్రీ డాక్టర్ కొలకలూరి ఇనాక్, కళారత్న డిక్కి కృష్ణ, ప్రముఖ సినీ గేయ రచయిత చంద్రబోస్ పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ కవిత అద్భుతమైనదని నవ్యతా, కవితాత్మ ఇమేజీనియం కలగల్పిన కవితలెన్నో పుస్తకం నిండా ఉన్నాయని కొనియాడారు. పట్టణంలోని పలువురు కవులు, సాహితీవేత్తలు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ వేళలు

ఉయ్యాలవాడ : మండలంలోని రైతులకు పగటి పూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ గురప్ప తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కొండుపల్లె, ఇంజేడు, అక్కంపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు తెల్లవారుజామున 5 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, మాయలూరు, సుద్దమల్ల ఫీడర్ల కింది గ్రామాలకు ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హరివరం, ఎస్.కొత్తపల్లె ఫీడర్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 6 నుంచి సాయంత్రం 3 గంటల వరకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా చేస్తామని వివరించారు.

భక్తితోనే భగవంతుడి అనుగ్రహం



తిరుప్పావై ప్రవచనాలను వినిపిస్తున్న హయగ్రీవాచారి

నంద్యాల(వ్యవసాయం): భక్తులు భక్తితో మాత్రమే భగవంతుడి అనుగ్రహం సాధ్యమవుతుందని టీటీడీ బ్రహ్మోత్సవాల నిత్య కల్యాణ వ్యాఖ్యాత డాక్టర్ దీవీ హయగ్రీవాచార్యులు పేర్కొన్నారు. ఆదివారం సంజీవనగర్ రామాలయంలో ధనుర్మాసాన్ని పురస్కరించుకొని టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్, భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో 16వ రోజు భక్తులకు తిరుప్పావై 16వ పాశురం భక్తులకు వివరించారు. గోదాదేవి గోపికలను నిద్ర నుంచి లేపి వారిని నందగోకుళం లోని భవనంలోకి శ్రీకృష్ణుడి నామస్మరణ జపిస్తూ నందనవనాన్ని దర్శించుకున్న తీరును వివరించారు.

మోటార్ సైకిళ్లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు



అప్పనపల్లె వద్ద ఢీకొన్న మోటార్ సైకిళ్లు

రుద్రవరం: మండలంలోని అప్పనపల్లె వద్ద రెండు మోటార్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. అప్పనపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు ఆదివారం రుద్రవరం వైపు, పెద్దకంబలూరుకు చెందిన నిఖిల్ రుద్రవరం నుంచి స్వగ్రామానికి మోటార్ సైకిళ్లపై వెళ్తుండగా అప్పనపల్లె సమీపంలోని తెలుగుగంగ ఉప ప్రధాన కాల్వ కట్టపై ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న గ్రానమస్తులు అక్కడికి చేరుకొని క్షతగాత్రుడిని 108లో స్థానిక వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.






నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మనందరెడ్డిని సత్కరిస్తున్న దృశ్యం, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 98 డీఎస్సీ అభ్యర్థులు, ఎమ్మెల్యేకు మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసా, పీపీ నాగిరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

అంబరాన్నంటిన 'నూతన' సంబరాలు

- వేడుకగా నూతన సంవత్సరానికి స్వాగతం
- ప్రజాప్రతినిధులకు వెల్లువెత్తిన శుభాకాంక్షలు
- కిటకిటలాడిన కార్యాలయాలు




ఎమ్మెల్యే శిల్పారవికి గజమాలతో శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు,మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డిని గజమాలతో సత్కరిస్తున్న దృశ్యం

నంద్యాల: నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రజలు జరుపుకున్న వేడుకలు అంబరాన్నంటాయి. ఆదివారం 2023 సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ప్రజలు ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కేక్‌లు కట్ చేసి, బాణా సంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలో ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగార్జెడ్డికి అధికారులు, నాయకులు, కార్యకర్తలు శభాకాంక్షలు తెలిపారు. ఉదయం 8 నుంచి రాత్రి వరకు పట్టణ ప్రజలతో పాటు నంద్యాల, గోస్పాడు మండలంలోని 40 గ్రామాల పంచాయతీలకు చెందిన ప్రజలు ఎంపీ, ఎమ్మెల్యేలకు శుభాకాంక్షలు తెలపడానికి తరలిరావడంతో వారి గృహాలు కిటకిటలాడాయి. శుభాకాంక్షలు తెలపడానికి మొక్కలు, పుస్తకాలు తీసుకురావాలనే పిలుపు మేరకు చాలా మంది పుస్తకాలు, పెన్సిళ్లు, స్కూల్ బ్యాగ్‌లు, స్కేళ్లు, మొక్కలు, తదితర వాటితో ఎమ్మెల్యే శిల్పాకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మున్సిపల్ చైర్‌పర్సన్ షేక్‌మాబున్నిసా మున్సిపల్ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ కేంద్ర పాలక మండలి సభ్యుడు మలికిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి బొమ్మలసత్రంలోని పార్టీ కార్యాలయంలో, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు పీపీ మధుసూదన్‌రెడ్డికి ఎన్‌జీఓ కాలనీలో, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ దేశం సులోచన ఎన్‌జీఓస్ కాలనీలోని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తుల, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని మాజీ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్లు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు శుభాకాంక్షలు తెలుపుకొని నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. అదే శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ఉద్యోగులతో ఉన్నతాధికారుల కార్యాలయాల వద్ద సందడి నెలకొంది.

ఆళ్లగడ్డ: కోటి ఆశలతో నియోజకవర్గ ప్రజలు ఆదివారం నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. పాత ఏడాది మిగిల్చిన జ్ఞాపకాలతో సరికొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టారు. అర్ధరాత్రి నుంచే పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం చెప్పడంలో భాగంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఆదివారం ఉదయం వివిధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలో మండలి విప్ గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అధ్యక్షతన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నూతన సంవత్సర సంబరాలకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి పార్టీ మండల కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలోని పోలీస్ అధికారులుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు డీఎస్పీ సుధాకర్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. సీఐలు రాజశేఖర్‌రెడ్డి, చంద్రబాబునాయుడు, గంగనాథబాబు, కొండారెడ్డి, ఎస్ఐలు తిమ్మయ్య, నరసింహులు, తిరుపాల్, వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ ఉన్నారు.



సబ్‌డివిజన్ పోలీస్ అధికారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

రుద్రవరం: మండలంలో ఆదివారం నూతన సంవత్సర వేడుకలు కోలాహలంగా నిర్వహించుకున్నారు. పాత సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ కొత్త సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కేక్‌లు కట్ చేసి, ఒకరినొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కొత్త సంవత్సరం అంతా మంచి జరగాలని ఆదివారం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు, అధికారులకు కార్యకర్తలు, సిబ్బంది నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. మండలంలోని పలు గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు ఉద్యోగులు, స్థానిక ఉద్యోగులు అభిమానులు.. ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్ యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

శిరివెళ్ల: మండలంలో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల నాయకులు, కార్యకర్తలు వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ.అబ్దుల్ సలాం, జిల్లా జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్‌నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, మండల నాయకుడు ఇందూరి ప్రతాపరెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, సీఐ చంద్రబాబునాయుడు, ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు సర్పంచులు, ఎంపీటీసీలు ఆళ్లగడ్డకు వెళ్లి మండలి విప్ గంగుల ప్రభాకరరెడ్డి, ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఇరిగెల నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.



పీపీ మధుసూదన్ రెడ్డిని సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

దొర్నిపాడు: మండలంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, జెడ్పీటీసీ శకుంతల, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, గుండుపాపల, దొర్నిపాడు సొసైటీ చైర్మన్‌లు బాల వెంకటరెడ్డి, భూమా చెంచిరెడ్డిని అభిమానులు, కార్యకర్తలు సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు హరిబాబు, శాంతయ్య, డీలర్ పెద్దన్న, చిన్నమద్దిలేటి పాల్గొన్నారు.

ఎంపీ పోచాకు జన్మదిన శుభాకాంక్షలు

కర్నూలు(అగ్రికల్చర్): నంద్యాల పార్లమెంటు సభ్యుడు పోచా బ్రహ్మనందరెడ్డికి జన్మదిన శుభాకాంక్షలతో పాటు, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఏపీజీఎల్ఐ ఉద్యోగుల సంఘం నేత, ఏపీఎన్‌జీవో అసోషియేషన్ ఉమ్మడి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.రామకృష్ణారెడ్డి, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటరెడ్డి తదితరులు ఎంపీని నంద్యాలలోని ఆయన నివాసంలో కలసి సత్కరించారు. ఒకవైపు జన్మదినంతో పాటు మరోవైపు నూతన సంవత్సర వేడుకలు నిర్వహించుకోవడం పట్ల వారు అభినందలు తెలిపారు. కేక్ కట్ చేసి ఎంపీకి తినిపించారు.



గంగుల ఇందిరమ్మకు శుభాకాంక్షలు తెలుపుతున్న పింఛన్ లబ్ధిదారులు



శిరివెళ్లలో కేక్ కట్ చేస్తున్న ఎంపీపీ



దొర్నిపాడు ఎంపీపీ, సొసైటీ చైర్మన్‌లకు శుభాకాంక్షలు తెలుపుతున్న గ్రామస్తులు



ఆళ్లగడ్డ మార్కెట్ యార్డు చైర్మన్‌కు రుద్రవరంలో శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



రాజగోపాల్ రెడ్డిని సన్మానించిన దృశ్యం

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు





సంజీవనగర్ రామాలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు, గుడిపాటిగడ్డలో బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది, లడ్డూలు సిద్ధం చేస్తున్న మహిళలు

నంద్యాల(వ్యవసాయం): సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయాణంలోకి సంచారం చేసే ముందు వచ్చే ఏకాదశినే వైకుంఠ ఏకాదశి అంటారు. ఈ పర్వదినాన వైష్ణవ ఆలయాల్లో ఉత్తర ద్వారం నుంచి భక్తులు స్వామిని దర్శించుకోవడం వల్ల విశేష ఫలితాలు లభిస్తాయని పురాణాలు పేర్కొంటున్నాయి. ఈ రోజున మహావిష్ణువు గరుడ వాహనదారుడై మూడు కోట్ల దేవలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని వేదాలు చెబుతున్నాయి. ఈ రోజు ఉపవాసం ఉంచి ద్వాదశి రోజు అన్నదానం చేస్తే ఎంతో పుణ్య ఫలం లభిస్తుంది. సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా పట్టణంలోని ఆలయాలు ముస్తాబయ్యాయి.

ముస్తాబైన ఆలయాలు..

పట్టణంలోని గుడిపాటిగడ్డ శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి దర్శనానికి సుమారు 20వేల మంది వస్తారని, అందుకు అనుకూలంగా ఉత్తర ద్వార దర్శనం, భారీ క్యూలైన్లన ఏర్పాటు చేశామని ఈఓ లఓత్మనారాయణ తెలిపారు. మహిళలు, పురుషులకు, వృద్ధులు, దివ్యాంగులకు వేర్వేరు క్యూలైన్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తెల్లవారుజామునే 4 గంటలకు దర్శనం ప్రారంభమై రాత్రి 9గంటలకు ముగుస్తుందన్నారు.

సంజీవనగర్ రామాలయంలో..

సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీదేవి, భూదేవి వేంటేశ్వరస్వామి మత్స్య అవతారంలో భక్తులకు దర్శనమిస్తారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు ఏర్పాటు చేశామని నిర్వాహకులు తెలిపారు. స్వామి వారి గర్భాలయాన్ని పూలు, పండ్లతో విశేషంగా అలంకరిస్తామని, భక్తుల దర్శనార్థం ఉత్తర ద్వారం ఏర్పాటు పూర్తయ్యిందని చెప్పారు.తెల్లవారుజామున 1గంటకు స్వామి వారికి విశేష పూజలు నిర్వహించి 4 నుంచి భక్తులను దర్శనానికి అనుమతిస్తామని, రాత్రి 10 గంటలకు వరకు దర్శించుకోవచ్చన్నారు. కాగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. బాలాజీ కల్యాణ మండపంలో ఉదయం 5గంటల నుంచి రాత్రి 9గంటల వరకు స్వామి వారిని దర్శించుకోవచ్చన్నారు. ద్వాదశిరోజున భక్తులతో లక్ష తులసీ దళార్చన, పుష్పాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాగులకుంట దేవాలయంలో వేంకటేశ్వరస్వామి వారికి తెల్లవారుజామున 1గంట నుంచి అభిషేకాలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామన్నారు.చిత్తలూరి వీధిలో శ్రీభజన మందిరం పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరం, మద్దూరు నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలోఏర్పాట్లు పూర్తి చేశారు.

ఉయ్యాలవాడ : వైకుంఠ ఏకాదశి సందర్భంగా మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలిసిన శ్రీ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయం ముస్తాబయ్యింది. ఉత్తర ద్వారం దర్శనం కోసం నిర్వహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అర్చకులు అనంతయ్య, రమణయ్య మాట్లాడుతూ తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి 4 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రుద్రవరం: వెలగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ గోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా నిర్వాహకులు ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేశారు. అలాగే భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చలువ పందిళ్లు, బారికేడ్లు తదితర ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు మధుసూదన్‌రెడ్డి, రంగనాయకులు, నరసింహులు, అర్చకులు గోపీశర్మ, శివకుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఆదివారం అర్ధరాత్రి దాటాక స్వామి అమ్మవార్లకు అభిషేకం,అలంకార పూజా కార్యక్రమాలు ఉంటాయన్నారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు ఉత్తర ద్వారంలో పూజలు గావించి 3 గంటల నుంచి భక్తులు దర్శించుకోవచ్చన్నారు. ఉదయం 10 గంటలకు స్వామి అమ్మవార్లకు కల్యాణోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.



రుద్రవరంలో భక్తుల కోసం వేసిన చలువ పందిళ్లు



ఇంజేడులో ముస్తాబైన లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

బొమ్మలసత్రం: రాష్ట్ర ప్రభుత్వ ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకుల ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక నంద్యాల సర్వజన ఆసుపత్రిలో అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, డీసీహెచ్‌ఎస్ జఫ్రుల్లా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సంఘం నాయకులు నాగేంద్రప్ప, జగదీశ్వరప్ప, సునీల్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నేడు రాష్ట్రస్థాయి పొట్టేళ్ల పోటీలు

పాములపాడు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని వాడాల గ్రామంలో సోమవారం రాష్ట్ర స్థాయి పొట్టేళ్ల పందెం నిర్వహించనున్నట్లు ఆర్సీఎం చర్చి సంఘ పెద్దలు ఆదివారం తెలిపారు. పోటీల్లో పాల్గొన దలిచిన వారు రూ.300 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలని చెప్పారు. విజేతలకు వరుసగా 30 తులాల వెండి, 20 తులాలు, 10తులాల వెండి బహుమతిగా అందజేస్తామని చెప్పారు. వివరాలకు సెల్ 8978036038, 9515325161 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.



ఆర్.పాంపల్లె సమీపంలో విరగ్గాసిన ఎర్రజొన్న పైరు



హరివరం సమీపంలో కనువిందు చేస్తున్న పూతతో ఉన్న కంది పంట

- పైర్లు కళకళ..

పుడమి మిలమిల

ఉయ్యాలవాడ : మండలంలో రబీ సీజన్‌లో సాగు చేసిన పంటలు కళకళలాడుతూ నేలకు పచ్చని రంగు వేసినట్లుగా కనువిందు చేస్తున్నాయి. ఈ ఏడాది అక్టోబర్‌లో మొదటి వారంలోనే భారీ వర్షాలు కురిశాయి. పొలాలు పదును కావడంతో నెల చివరి వారం నుంచి పంటలు సాగు చేశారు. వరుణుడు కరుణించడంతో మెట్ట పంటలు కళకళలాడుతుండడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మరో నెల రోజులు గడిస్తే దిగుబడులు చేతికి వస్తాయి. పప్పుశనగ 30 వేల ఎకరాల్లో, జొన్న 350, పొగాకు 80, కంది 110, మినుము 160, కుసుమ 200, మినుము 190, మొక్కజొన్న 120 ఎకరాల విస్తీర్ణంలో సాగయ్యాయని మండల వ్యవసాయాధికారి రాజేంద్రకుమార్ వివరించారు.



ఉయ్యాలవాడ సమీపంలో పూత, కాయ దశలోనున్న శనగ పైరు



ఇంజేడు సమీపంలో మిరుమిట్లు గొలుపుతున్న తెల్ల కుసుమ పంట

పింఛన్‌దారుల్లో నూతనోత్సాహం



గుండుపాపలలో నూతన పింఛన్లను అందజేస్తున్న ఎంపీపీ, ఎంపీడీఓ, సచివాలయ కన్వీనర్లు

దొర్నిపాడు: నూతన సంవత్సర ప్రారంభ వేళ పింఛన్ దారుల్లో నూతనోత్సాహం కనిపించింది. గత నెల వరకు రూ.2,500 గా ఉన్న పింఛన్ మొత్తాన్ని ప్రభుత్వం ఈనెల నుంచి రూ.2,750కి పెంచి ఇస్తుండటంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆదివారం మండలంలోని గుండుపాపల గ్రామంలో సచివాలయ కన్వీనర్లు లక్ష్మి, జక్కుల రాముడు, నాగేశ్వరయ్య సమక్షంలో ఎంపీపీ అమన్‌నాథ్‌రెడ్డి, ఎంపీడీఓ నాగ అనసూయ పెంచిన పింఛన్ సొమ్ము రూ.2,750 అందజేశారు. సొసైటీ చైర్మన్ బాల వెంకటరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటనారాయణ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : వైఎస్సార్ పింఛన్ కానుక పథకం కింద ప్రభుత్వం రూ. 2,750లకు పెంచిన పింఛన్ సొమ్మును ఆదివారం లబ్ధిదారులకు అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.



ఆర్.పాంపల్లెలో పుట్టాలమ్మకు పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ చాబోలు లక్ష్మిదేవి